క్లుప్తంగా

వెటరన్ పోటీల్లో నెల్లూరీయుల ప్రతిభ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జాతీయ వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్–2025 పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఇటీవల రాజస్థాన్ ఆల్వార్‌రాజ్ రుషీ స్టేడియంలో జరిగిన పోటీల్లో 32 మంది క్రీడాకారులు తమ సత్తాను చాటురు. 36 బంగారు, 16 వెండీ, 15 కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా వెటరన్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ డి.బసవయ్య, మహిళా అధ్యక్షురాలు పి.కోటేశ్వరమ్మ, జాయింట్ సెక్రటరీ హజరత్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామచంద్ర, ట్రెజరర్ శ్రీనివాసులు సోమవారం అభినందించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో వేలంపాటలు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ–టెండర్, సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలంపాటలను సోమవారం నిర్వహించారు. అలాగే ఈనెల 18న కొబ్బరికాయలు, పూజా సామగ్రి దుకాణం, పూల దుకాణం, కల్యాణ మండపం లీజు హక్కుల కోసం బహిరంగ వేలంపాట ఉంటుందని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు.

సహకారం అందించాలి



వినతి పత్రం ఇస్తున్న ఎన్జీఓ నేతలు

నెల్లూరు(అర్బన్) : ఏసీ స్టేడియంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించేందుకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆనంద్‌ను ఏపీఎన్జీఓ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు వారు సోమవారం రాత్రి కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులకు మూడు రోజుల పాటు స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఆటల పోటీలను కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించాలని ఆహ్వానించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఆంజనేయవర్మ, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంచలయ్య, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నేత వినతి

నెల్లూరు రూరల్ : రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నెలకొన్న సమస్యలపై బీజేపీ నేత మిడతల రమేష్ తెలుగుగంగ పర్యవేక్షణాధికారి రాధాకృష్ణారెడ్డికి కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, పైడిమాని ఆదినారాయణ, నారాయణ, సుబ్బయ్య ఉన్నారు.

ఘంటసాల వర్ధంతి నేడు

నెల్లూరు(బృందావనం) : పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 52వ వర్ధంతిని నర్తకి సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. స్థానిక నర్తకిసెంటర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు గాన నీరాజనం ఉంటుందన్నారు. పాటూరు శ్రీనివాసులు, ఎల్.ఆనంద్, భరద్వాజ్ పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిపై అవగాహన ఉండాలి



నెల్లూరు(అర్బన్) : మూర్ఛ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎనెల్ ఆస్పత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ హరితకుమారి అన్నారు. ప్రపంచ ఎపిలెప్సి డే (మూర్ఛ వ్యాధి)ను పురస్కరించుకుని స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఎనెల్ ఆస్పత్రిలో సోమవారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరితకుమారి మాట్లాడుతూ మూర్ఛ వ్యాధిపై భయపడాల్సిన పనిలేదన్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే తగ్గిపోతుందన్నారు. మూర్ఛ వచ్చిన రోగుల చేతిలో తాళాలు లాంటివి ఉంచరాదన్నారు. గాలి వెలుతురు వచ్చేలా చూడాలన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రూరల్ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఈఈ సోమశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాపూరు, సైదాపురం, పొదలకూరు, మనుబోలు, టీపీగూడూరు, కలువాయి, నెల్లూరు రూరల్, ముత్తుకూరు, వెంకటాచలం, విరుపూరు, కావేరినగర్, బుజబుజ నెల్లూరు, నారాయణరెడ్డిపేట ప్రాంత విద్యుత్ సమస్యలపై ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు రాపూరులోని సబ్ స్టేషన్ వద్ద ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఉంటుందని తెలిపారు.



తల్పగిరి కాలనీలో ఓ నర్సింగ్ కళాశాల వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



బురదతో కూడిన మట్టిరోడ్డు



వీధిదీపాలు లేని విద్యుత్ స్తంభం



ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్త

తల్పగిరిలో ప్రగతి జాడేదీ?

సమస్యల నిలయంగా తల్పగిరి కాలనీ
- ఇక్కడ మట్టిరోడ్లే దిక్కు
- నెలల తరబడి మురుగు నిల్వ
- వెలగని వీధిదీపాలు, తొలగని చెత్త

నగరంలోని తల్పగిరి కాలనీ ఏర్పడి 40 ఏళ్లు దాటినా అభివృద్ధి జాడ కానరావడం లేదు. ఇక్కడ కనీస వసతులు లేక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. మౌలిక వసతులైన రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ, పారిశుధ్య నిర్వహణ గురించి ప్రజలు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం ఉండడం లేదు.

నెల్లూరు(అర్బన్) : నగరంలోని అయ్యప్పగుడి–బుజబుజ నెల్లూరు మధ్యలో ఉన్న తల్పగిరి కాలనీ సమస్యల కేంద్రంగా ఉంది. ఇక్కడ మురుగుతో నిండిన రోడ్ల మధ్య నివాసాలు ఉన్నాయి. కాలనీ ఏర్పడి నాలుగు దశాబ్దాలు దాటినప్పటికీ కనీస వసతులు మృగ్యమయ్యాయి. దీంతో అక్కడ ఉంటున్న మధ్యతరగతి, పేద ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఎక్కువ వీధులకు రోడ్లు లేవు. లేఅవుట్ వేసినప్పటి నుంచి మట్టి వీధులే ఉన్నాయి. పలుకుబడి ఉన్న వారు ఒకటి, రెండు వీధుల్లో మాత్రమే సిమెంటు రోడ్లు వేయించుకున్నారు.

చినుకు పడితే బురదమయం

ఇక్కడ చినుకు పడితే మిగతా వీధులన్నీ బురదమయంగా మారుతాయి. ఇలా నెలల తరబడి బురదమయమైన రహదారుల్లోనే నడవాల్సిన పరిస్థితి. అక్కడ ఉన్న ఓ నర్సింగ్ కళాశాల హాస్టల్, పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున డ్రైనేజీ నీరు పొంగి రోడ్లపైనే ప్రవహిస్తోంది. పాదచారులు, వాహనదారులు ఆ మురుగులోనే ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొంది. ఎక్కువ వీధులకు వీధిదీపాలు లేవు. ఉన్నచోట్ల కూడా వెలగడం లేదు. దీంతో చీకటి పడితే ఆ ప్రాంతంలో నడవాలంటే ప్రజలు వణికిపోతున్నారు. మరో వైపు ఖాళీప్లాట్లలో మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. కూతవేటు దూరంలో ఉన్న ఐదో నగర్ పోలీసులు కూడా ఇటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ఖాళీ ప్లాట్లు.. చెత్తకు ఆవాసాలు

ఇక్కడి నివాసాల మధ్య పలుచోట్ల ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. వాటిని పర్యవేక్షించేవారు ఉండడం లేదు. దీంతో ప్రజలు చెత్తను అక్కడే వేస్తున్నారు. మున్సిపల్ అధికారులు కూడా చెత్తను తొలగించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త వేసేందుకు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు లేక ఇబ్బంది



తల్పగిరి కాలనీలో ఆటో నడపాలంటే నరకం కనిపిస్తోంది. ఇక్కడ సరైన రోడ్లు లేవు. పెద్ద, పెద్ద గోతులతో కూడిన రహదారుల్లో ప్రయాణించాలి. డ్రెయినేజీ నీరు రోడ్లపైకి పొంగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు వేయాలి

– రాజు, ఆటో డ్రైవర్, స్థానికుడు

సైడు కాలువలు ఏర్పాటు చేయాలి



ఇక్కడ నడవాలన్నా కూడా ఇబ్బందిగా ఉంది. రోడ్లపైకి డ్రెయినేజీ నీరు వస్తోంది. అందువల్ల ప్రధానంగా రోడ్లతో పాటు సైడు కాలువలను ఏర్పాటు చేయాలి. అలాగే తాగునీటి కుళాయిలు బిగించాలి.

– రాహిల, కళాశాల విద్యార్థిని

హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం) : రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది అక్టోబరు 21 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు రూ.28,08,340, అన్నదాన హుండీ ద్వారా రూ.80,351, అలాగే 15 అమెరికన్ డాలర్లు కానుకల రూపంలో వచ్చిందన్నారు. పర్యవేక్షణాధికారిగా పూడిపర్తి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎన్.శ్రీధర్‌నాయుడు వ్యవహరించగా, ప్రధానార్చకుడు ఎస్.రఘురామమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు

నెల్లూరు(క్రైమ్) : మద్యం మత్తులో ఇద్దరు యువకులు బుల్లెట్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, సేకరించిన సమాచారం మేరకు.. నగరానికి చెందిన ఇద్దరు యువకులు సోమవారం రాత్రి పూటుగా మద్యం సేవించారు. బుల్లెట్‌పై మినీబైపాస్ మీదుగా అయ్యప్పగుడి వైపు బయలుదేరారు. జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో డివైడర్ మధ్యలో ఇనుపరేకుకు బైక్ తగిలి ప్రమాదానికి గురైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదంలో ఒకరికి కాలు తెగిపోగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులు నగరానికి చెందిన సాహిత్‌వర్మ, యశ్వంత్ అని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కొత్త డంపర్ బిన్లను ఏర్పాటు చేయండి



కొత్త డంపర్ బిన్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగర వ్యాప్తంగా ఉన్న పాత డంపర్ బిన్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక బట్వాడిపాళెం సెంటర్, వెహికల్ షెడ్, టీబీ హాస్పిటల్ వెహికల్ షెడ్, బారాషహీద్ దర్గా తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. వెహికల్ షెడ్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. టీబీ హాస్పిటల్ వెహికల్ షెడ్‌లో చెత్త తరలింపు వాహనాలకు అవసరమైన పెయింటింగ్, మరమ్మతు పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజూ అన్ని డివిజన్లలో చెత్త సేకరణ వాహనాలు తిరిగే విధంగా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ రఘురాం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఒక్క మాత్రతో నులి పురుగుల నివారణ

- కలెక్టర్ ఆనంద్



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్) : ఒక్క ఆల్బెండజోల్ మాత్రతో పిల్లల్లో నులి పురుగుల నివారణ సాధ్యమని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక మూలాపేటలోని ఈఎస్‌ఆర్‌ఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల లోపం, ఆకలి లేకపోవడం, నీరసంగా ఉండడం లాంటి లక్షణాలుంటే నులిపురుగులు పొట్టలో ఉండే అవకాశముందన్నారు. అందువల్ల 19 ఏళ్లలోపు వారికి మాత్రలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, హెచ్‌ఎం శివరాం ప్రసాద్, స్థానిక వైద్యాధికారి ప్రతిమారెడ్డి, ఆశా కార్యకర్తల, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

- స్థానిక తాతయ్య బడి పాఠశాలలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అర్బన్‌హెల్త్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వెంగళరావునగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రీనా భారతి పలు సూచనలు చేశారు. పీఎంపీ నాయకులు జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, హెచ్‌ఎం వెంకట్రావు పాల్గొన్నారు.
- నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని సౌత్ మోపూరు పీహెచ్‌సీ పరిధిలో శ్రీపాద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.అశోక్, ఆరోగ్య కార్యకర్త నారాయణమ్మ, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, మస్తానమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణికి విజయవంతంగా ఆపరేషన్

నెల్లూరు(అర్బన్) : హైరిస్క్‌తో కూడిన నిండు గర్భిణికి ఆపరేషన్ చేసి తల్లీబిడ్డను కాపాడిన ఘటన సోమవారం నగరంలోని సర్వజన ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఈ వివరాలను ఆస్పత్రిలో గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులతో కలిసి వివరించారు. కావలి పరిధిలోని మోచర్ల గ్రామానికి చెందిన 25 ఏళ్ల రజినీ నిండు గర్భిణి అని, ఆమెకు తీవ్రమైన జ్వరంతో పాటు నొప్పులు ప్రారంభమయ్యాయన్నారు. కావలి ఏరియా ఆస్పత్రికి వెళ్లగా వారు పెద్దాస్పత్రికి పంపించారన్నారు. ఇక్కడ ఆమెకు పరీక్ష చేయగా డెంగీ జ్వరంగా తేలిందన్నారు. అంతేకాకుండా రక్తకణాలు 40 వేలు కూడా లేవన్నారు. అంతేకాకుండా ఆమె రక్తకణాలు కూడా పెద్దాస్పత్రిలో లేకపోవడంతో వైద్యులు సొంత ఖర్చుతో బయట నుంచి బి–పాజిటివ్ రక్తకణాలు తెప్పించి ఆపరేషన్ చేసి తల్లీ, బిడ్డను కాపాడినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, సభ్యులు సురేష్, బ్రహ్మానందరెడ్డి తదితరులు గీతాలక్ష్మిని, సుశీల్‌ను సన్మానించారు.

జయప్రదం చేయండి



విలీన సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్) : ఈనెల 14న నిర్వహించనున్న పీడీఎస్‌యూ విలీన సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సునీల్, షారూఖ్ తెలిపారు. స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో విలీన సభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీడీఎస్‌యూ 2013లో రెండుగా చీలిందని, ఇప్పుడు మళ్లీ రెండు కలవనున్నట్లు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం నాలుగు శాతం నిధులు కేటాయించారన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. తల్లికి వందనం, మెగా డీఎస్సీ, మెస్ చార్జీల పెంపును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నాగరాజు, ఆసీర్, నవీన్, హర్ష, చరణ్, వంశీ పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ మీట్

నెల్లూరు (టౌన్) : స్థానిక పార్థసారథి నగర్‌లోని జెనెక్స్ విజన్–బీ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్ 2కే25ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర ఆటల పోటీలు జరిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు వినతి

నెల్లూరు(బారకాసు) : స్థానిక ఆత్మకూరు బస్టాండ్, బృందావనం సమీపంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్ సమీపంలో ఆక్రమణలు తొలగించాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కోరారు. ఈమేరకు ఎన్‌ఎంసీలో సిటీప్లానర్ హిమబిందును కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డును ఆక్రమించి పది దుకాణాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని, రాత్రి 12 వరకు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తలపల చంద్రమౌళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, రాష్ట్ర నేత సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

నెల్లూరు(క్రైమ్) : తమకు రక్షణ కల్పించాలని పలువురు హిజ్రాలు ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వారు ఎస్పీని కలిసి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేశారు. ప్రత్యర్థి గ్రూపుల చేష్టలు భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు. తాము ప్రశాంతంగా జీవించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీని కోరారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : కబడ్డీ క్రీడాకారుడు వి.సునీల్‌కృష్ణ మెమోరియల్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.మునిరాజ్, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, హోమ్‌గార్డ్స్ యూనిట్ డీఎస్పీ ఎం.వెంకటరమణ, డీటీసీ శ్రీనివాసరెడ్డి, ఎంటీఓ ఆర్‌ఐ అంకమరావు, ఆర్‌ఐ అడ్మిన్ జె.హరిబాబు, వెల్ఫేర్ ఆర్‌ఐ రాజారావు, హోమ్‌గార్డ్ యూనిట్ ఆర్‌ఐ పాల్‌రాజ్ అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 33/11 కేవీ హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాకోనగర్, డీఎస్‌కే గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుళాయి పన్నుల వసూళ్లను పూర్తి చేయండి

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎస్‌ఎంసీ ఇంజినీరింగ్, టిడ్కో, హౌసింగ్ విభాగాలధికారులతో పాటు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. బకాయిలున్న వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గృహాల్లో స్టేజ్ కన్వర్షన్, ఆప్షన్–1 అండ్ 2 ప్రక్రియలు పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వారంలో ఒక స్టేజ్ కన్వర్షన్, ఒక గృహ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి

- అదనపు కమిషనర్ నందన్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వస్తున్న అర్జీలను వేగంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ అన్నారు. ఎస్ఎంసీ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. తొలుత ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని, వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నగర పాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కారం చూపాలన్నారు. టిడ్కో గృహాలను పొందేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపిస్తున్నారని, అయితే బ్యాంకు రుణాలు పొందేందుకు తప్పనిసరిగా మంచి సిబిల్ స్కోర్ ఉండాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో స్థానికులు కూడా భాగస్వాములు అయితే పనులు మరింత పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయగలమని చెప్పారు. కాగా పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 77 ఫిర్యాదులు అందుకున్నామని, అందులో విభాగాల వారీగా ఇంజినీరింగ్ 25, హౌసింగ్ 40, టౌన్‌ప్లానింగ్ 9, రెవెన్యూ 1, అకౌంట్స్ 2 చొప్పున ఫిర్యాదులు అందుకున్నామని అదనపు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సిటీప్లానర్ హిమబిందుతో పాటు ఇతర విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



హెల్త్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ సత్తార్

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలో షబే–బరాత్‌కు సంబంధించిన శ్మశానవాటికతో పాటు స్థానిక ప్రార్థనా మందిరాల వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్.సత్తార్ కోరారు. ఈ మేరకు ఎస్ఎంసీలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన సోమవారం పార్టీ నాయకులతో కలిసి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని సూచించారు. పార్టీ నాయకులు జాకీర్‌హుస్సేన్, ఎండీ జుబేర్, నిస్సార్‌అహ్మద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్) : ప్రతిఒక్కరూ చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా సూచించారు. రామచంద్రాపురంలోని హిమాలయ స్కూల్‌లో మహిళలు, చిన్నారుల రక్షణ, బీఎన్ఎస్(భారతీయ న్యాయసంహిత), బీఎన్ఎస్ఎస్(భారతీయ నాగరిక్ సురక్ష సంహిత), బీఎస్ఏ(భారతీయ సాక్ష్య అధినియం) తదితర చట్టాలు, సైబర్ క్రైమ్, గుడ్– బ్యాడ్ టచ్ తదితరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచివి కావన్నారు. ఆకర్షణలకు లోను కాకుండా చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర వేళల్లో 112కు కాల్‌చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు.